సాక్షి
నిజామాబాద్
శనివారం । 3 । మే । 2025



'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి 'దోస్త్' (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది.

- 10లో ▸



ముందస్తు బడిబాట!

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి కొందరు ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం చేపడుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
44.1 /23.4

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

నీడ.. నీళ్లు కరువు


2.56 లక్షలు జిల్లాలో జాబ్ కార్డుల సంఖ్య

4.86 లక్షలు జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీల సంఖ్య



డొంకేశ్వర్ మాసం చెరువులో గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

మండుటెండలోనే ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. పని జరిగే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్న నిబంధనలు జిల్లా లో ఎక్కడా అమలు కావడం లేదు. సేద తీరేందుకు నీడ, దాహం తీర్చుకునేందుకు నీళ్లు లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. గాయాలైతే చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో లేవు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొనగా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి అధికారాలు లేకపోవడంతో వారు సైతం మౌనంగా ఉంటున్నారు.



టెంటు లేకపోవడంతో చెట్టు నీడన కూర్చున్న కూలీలు

- మండుటెండలో 'ఉపాధి' పనులు
- కూలీలకు సౌకర్యాలు కల్పించని అధికారులు
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లోని 530 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. వేసవిలోనే ఉపాధిహామీ పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు వస్తారు. ఎండ తీవ్రతకు చెరువుల వద్ద పనులు చేసేందుకు కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుటెండలో పని చేసే కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉపాధిహామీ చట్టం చెబుతోంది. గతంలో నీడ కోసం చేసేందుకు షేడ్ నెట్లు లేదా టెంట్లు ఉండేవి. ప్రభుత్వం సరఫరా చేయడం లేదని అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో కూలీలు పని చేసే ప్రాంతాల్లో చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. చెట్లు లేకపోతే ఎండలోనే ఉంటున్నారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించాల్సిన గ్రామ పంచాయతీలు ఆ బాధ్యత తను మరిచాయి. దీంతో కూలీలే ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. అవి కూడా అయిపోతే దాహంతో అల్లాడుతున్నారు. కాగా, పని చేస్తుండగా కూలీలకు గాయాలైతే చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేవు. ప్రభుత్వం వీటి సరఫరా కూడా నిలిపివేసింది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కావాల్సి వస్తే స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

చెట్ల కిందికి పోతున్నాం..



ఊరికి దూరంగా ఉన్న చెరువు వద్దకు కాలినడకన వస్తున్నాం. ఎండలో పని చేస్తే నీరసం వస్తోంది. నీడ కోసం చెట్ల కిందికి పోతున్నాం. తాగేందుకు నీళ్లు లేకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి పని చేసే దగ్గర నీడ, నీరు సౌకర్యాలు కల్పించాలి.

– హైమదీ, ఉపాధి కూలీ, డొంకేశ్వర్

ఏపీవోలకు ఆదేశాలిస్తాం..



ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధిహామీ పని వేళలను మార్చింది. ఉదయం, సాయంత్రం వేళల్లోనే కూలీలతో పనులు చేయించాలని సూచించింది. పని జరిగే ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీలు, ఫీల్డ్ అసిస్టెంట్లదే. మండలాల ఏపీ వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి సౌకర్యాలు ఉన్నాయో లేదో చూడాలని ఆదేశాలిస్తాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో, నిజామాబాద్

● వడదెబ్బపై

అవగాహన కల్పించండి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం

నిజామాబాద్‌అర్బన్: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మండుటెండలతో జిల్లాలో ఎక్కడా ప్రాణనష్టం వంటి ఘటనలు చోటుచేసుకోకుండా అవగాహన పెంపొందించాలన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హితవు పలికారు. కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పనులు చేసేలా, పని ప్రదేశాలలో తప్పనిసరిగా నీడనిచ్చేలా షామియానాలు, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సరిపడా ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని, దీంతో వైద్య సిబ్బంది తక్షణమే చికిత్స అందిస్తారన్నారు.

న్యూస్‌రీల్

రైతుల వివరాలు అప్‌డేట్ చేయాలి

● కోదండరెడ్డికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి వినతి



సుభాష్‌నగర్ : ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలు, మిస్సింగ్ డేటాను రుణమాఫీ పోర్టల్‌లో అప్‌డేట్ అయ్యేలా చూడాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి కోరారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం రమేశ్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని సొసైటీల్లో సీబీలో నమోదు చేయని కారణంగా రుణమాఫీ వర్తించలేదని, ఆ రైతుల వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేసి రుణాలు మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ కోదండరెడ్డి విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా రుణమాఫీ అమలయ్యేలా చూస్తామని హామీనిచ్చారన్నారు. అంతకు ముందు కోదండరెడ్డిని శాలువాతో సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు, టీజీసీఏబీ ఎండీ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ రాసి తిరిగి వస్తూ అనంతలోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నిర్మల్ జిల్లావాసులు మృతి




అశ్విని



మంజుల

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. జక్రాన్‌పల్లి ఎస్సై ఎండీ మాలిక్ రహమాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని లోతర్య తండాకు చెందిన బానవత్ మంజుల(19), బానవత్ అశ్విని(17) శుక్రవారం ఎప్‌సెట్ రాసేందుకు కారులో హైదరాబాద్ వెళ్లారు. పరీక్ష రాసి తిరిగి వస్తుండగా.. అర్గుల్ శివారులోని జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న అక్కా చెల్లెళ్లు మంజుల, బానవత్ అశ్విని అక్కడికక్కడే మృతి చెందారు. కారును నడుపుతున్న జాదవ్ హంసరాజుకు కాలు, చేయి విరిగాయి. అతడిని ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

పిల్లలు సెల్‌ఫోన్లకు బానిస కావొద్దు



ఖలీల్‌వాడి : పిల్లలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, బానిస కావొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి అన్నారు. నగరంలోని ఆర్‌బీవీఆర్‌ఆర్‌లో విద్యార్థినులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్లతో మంచి, చెడు రెండు ఉంటాయన్నారు. సెల్‌ఫోన్లను మంచికి ఉపయోగించాలని, చెడు వైపు ఎక్కువగా ప్రభావితం కావొద్దన్నారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఇతరులతో ఎలా ఉండాలో పిల్లలకు తల్లిదండ్రులు స్పష్టంగా చెప్పాలన్నారు. విద్యార్థినులు చదువుకునేటప్పుడు ఈవ్‌టీజింగ్ ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలను సమ్మర్‌క్యాంప్‌లో నేర్చుకోవడం గొప్పవిషయమన్నారు.

ఆత్మస్థైర్యం పెరుగుతుంది : సీపీ

సమ్మర్ క్యాంప్ ద్వారా బాలికలకు ఆత్మస్థైర్యం పెరుగుతుందని సీపీ సాయిచైతన్య అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిని అపాయం జరిగితే స్పందించాలన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని, ఈ శిబిరం ద్వారా కొత్త నైపుణ్యాలను నేర్చుకున్నారన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రొబేషనరీ ఐపీఎస్ సాయికిరణ్, నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్, రిటైర్డ్ సీఐ కిషన్, తైక్వాండో ట్రెయినర్ మనోజ్, జేసీఐ సభ్యులు విజయానంద్, ఆర్‌బీవీఆర్‌ఆర్ సొసైటీ సభ్యులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి జాబితా వారిదే

- రాజీవ్ యువ వికాసానికి..
- ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ
- సీఎంఆర్‌ఎఫ్ విషయంలోనూ ఇదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆర్మూర్ నియోజకవర్గంలో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎవరికివారే అన్నట్లుగా అధికార కాంగ్రెస్, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ప్రత్యేకంగా జాబితాలు పంపుతున్నారు. ఇరు పార్టీల నుంచి వేర్వేరుగా జాబితాలు వస్తుండడంతో అధికారులు పరేషాన్ అవుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ద్వారా ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ద్వారా బీజేపీ నాయకులు ఎవరికి వారే తమకు నచ్చినవిధంగా లబ్ధిదారుల పేర్లతో జాబితాలు పంపిస్తుండడంతో ఈ నియోజకవర్గంలో ప్రత్యేక వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో అధికారులు ఎవరి జాబితాలను ఫైనల్ చేయాలో అనే విషయమై తేల్చుకోలేకపోతున్నారు. ఇటు చూస్తే అధికార పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, అటు చూస్తే ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మధ్య అధికారులు నలిగిపోతున్నారు. అసలే రాకేశ్ రెడ్డి బహిరంగంగా, మీడియా ముఖంగా కడిగిపారేసే రకం కావడంతో అధికారులు ఆగమాగం అవుతున్నారు. దీంతో చేసేదేమీ లేక వచ్చిన జాబితాల్లోని పేర్లను కాదనకుండా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు.



అభివృద్ధి పనుల్లోనూ..

ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తులు చేసుకునే విషయంలోనూ ఈ నియోజకవర్గంలో ప్రజలు ఎవరిని కలవాలనే విషయమై గందరగోళానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డితోపాటు వినయ్‌రెడ్డిలను కలుస్తూ దరఖాస్తులు ఇస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లోని ఆయా పార్టీల నాయకులు ఎమ్మెల్యే, వినయ్‌రెడ్డిలను కలిసి ఎవరికి వారుగా ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నారు. ఈ ప్రతిపాదనల్లో వేటికి ప్రాధాన్యం ఇవ్వాలో అనే విషయమై అధికారులు కక్కలేక మింగలేక అన్నట్లుగా ఉండాల్సి వస్తోంది. మరోవైపు పోలీసులు సైతం పరేషాన్ అవుతున్నారు. కొన్నిసార్లు ఒకే కేసు విషయమై ఇరుపార్టీల నాయకులు వేర్వేరు వర్గాల తరఫున ఫోన్ చేస్తే ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీ తరఫున వచ్చిన వారికి అనుకూలంగా వ్యవహరిస్తే ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వర్గీయుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయని, సందర్భాన్ని బట్టి ఎదుటి వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తే అధికార పార్టీ బడా నేతల ఆగ్రహానికి గురవుతున్నామని వాపోతున్నారు.

భూ భారతి పకడ్బందీగా అమలు చేయాలి

- 5 నుంచి ఎంపిక చేసిన మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- ఇందిరమ్మ ఇళ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏప్రిల్ 17 నుంచి 30 వరకు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈ నెల 5 నుంచి 20 వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో పైలట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. కాగా, భూభారతి నూతన చట్టంపై రాష్ట్రంలో 605 మండలాలకు గాను ఇప్పటివరకు 590 మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగిందని, 85,527 మంది పౌరులు, 1,62,577 మంది రైతులు అవగాహన సదస్సులలో పాల్గొన్నారని మంత్రి వివరించారు.

నీట్‌కు పటిష్ట ఏర్పాట్లు..

ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లాలో 3,398 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఎంపికలో అత్యంత పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేశారు. 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఇంటి నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. వీసీలో సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు దిక్కెవరు?

- మోర్తాడ్‌కు చెందిన రైతు మెండె దాను తన పొలంలో పండించిన సన్నరకం వరి ధాన్యం 50 క్వింటాళ్లను స్థానికంగా ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తరలించాడు. 15 రోజులవుతున్నా ఆ ధాన్యాన్ని మిల్లుకు తరలించలేకపోతున్నారు. ఇదేమిటని రైతు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నిస్తే మిల్లర్లు సన్నరకాలను తీసుకోవడం లేదనే సమాధానం వచ్చింది. ఇది ఒక్క రైతు మెండె దానుకు ఎదురైన చేదు అనుభవమే కాదు. సన్నరకం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన ఎంతో మంది రైతులకు తప్పనిఇబ్బంది.

- వడ్లు దించుకోవడానికి అంగీకరించని మిల్లర్లు
- దొడ్డు రకాలే తీసుకుంటామని స్పష్టం చేస్తున్న వైనం
- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం



మోర్తాడ్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా పోసి ఉంచిన వరి ధాన్యం

మోర్తాడ్(బాల్కొండ) : సన్నరకం వడ్లు పండించిన రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సన్న రకం ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 ల బోనస్ ఇవ్వడంతో యాసంగిలోనూ అదే ఉత్సాహంతో రైతులు సన్నరకాలు సాగు చేశారు. అయితే, యాసంగి సీజన్‌లో పండించిన సన్నరకం వడ్లను మిల్లింగ్ చేస్తే ఎక్కువ శాతం నూక వస్తుందనే కారణంతో మిల్లర్లు వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకంతో ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 70శాతానికి పైగా సన్నరకాలను సాగు చేశారు. కాగా, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, వేల్పూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా తదితర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం సన్నరకం వడ్లు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితి

సన్నరకాలను సేకరించే విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం సన్నరకాలను కొనుగోలు చేయలేక నిర్వాహకులు చేతులు ఎత్తివేసిన పరిస్థితి కనిపిస్తోంది. మోర్తాడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో సేకరించిన సన్నరకం వరి ధాన్యాన్ని వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ రైస్‌మిల్లుకు ఇటీవల తరలించారు. అక్కడ యజమాని సన్న రకం వడ్లను దించుకోకపోవడంతో సహకార సంఘం ఉద్యోగులు అంకాపూర్ మిల్లుకు తరలించారు. ఇదే విషయాన్ని అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తే సన్నరకాలను కచ్చితంగా దించుకుంటారని, ఎలాంటి సమస్య ఉండదని చెబుతున్నారు. అధికారులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులు విరుద్ధంగా ఉండడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి సన్నరకాలను మిల్లర్లు సేకరించేలా పక్కాగా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు

సన్నరకాలను సాగు చేస్తే ప్రోత్సాహకం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ధాన్యం సేకరణలో అడ్డంకులు ఏర్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సన్నరకాలను మార్కెట్‌లో విక్రయిస్తే ధర అంతంత మాత్రంగానే ఉంది. కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా ధాన్యం సేకరించాలి.

– ఏనుగు రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

అధికారులకు విన్నవించాం

సన్నరకం వరి ధాన్యాన్ని కొన్ని మిల్లుల యజమానులు దించుకోవడం లేదు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించాం. మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాలు అప్పగించడంతో వారు ఎంతో ఉత్సాహంతో పని చేస్తున్నారు. మిల్లర్లు కూడా సహకరిస్తే మా కొనుగోలు లక్ష్యం నెరవేరుతుంది. – శ్రీనివాస్, సీసీ, ఐకేపీ

దొడ్డు ధాన్యమే కావాలంటున్నారు

మిల్లర్లు దొడ్డు రకం వరి ధాన్యం కావాలంటున్నారు. సన్నరకాలను దించుకోకపోవడంతో మాకు చాలా ఇబ్బంది అవుతోంది. రైతులు ఎక్కువ శాతం సన్నరకాలనే సాగు చేయడంతో అంతటా సన్నరకం నిలువలే ఉన్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– కాశీరాం, సీఈవో, మోర్తాడ్ సహకార సంఘం

నెల రోజులుగా సెంటర్‌లోనే..



మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లుకు తరలించడంలో జాప్యం ఏర్పడుతోంది. ఒక్కో సెంటర్‌లో పక్షం నుంచి నెల రోజుల తరబడి బస్తాలు ఉంటున్నాయి. మాక్లూర్ మండలం అమ్రాద్ సొసైటీ పరిధిలోని అమ్రాద్ తండాలో తూకం వేసిన బస్తాలను తరలించకపోవడంతో విసుగెత్తిన గోవింద్ అనే రైతు ధాన్యం బస్తాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు. తనతోపాటు తండాకు చెందిన ఏ ఒక్క రైతు ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించలేదని, నెల రోజులుగా ఎండకు ఎండి తాల్పుకుపోతున్నాయని వాపోయాడు. సొసైటీ చైర్మన్ ఎనుగంటి శంకర్‌గౌడ్‌కు ఫోన్ చేస్తే లారీలు, లేబర్‌ల కొరత ఉందని సమాధానం ఇస్తున్నాడని తెలిపారు. సొసైటీ సీఈవో గంగారాం ఫోన్ స్విచ్ఛాఫ్ పెట్టుకుంటున్నాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. లారీల కొరతతో గ్రామాల్లోని ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని వడ్లను మిల్లుకు తరలిస్తున్నా. అమ్రాద్‌తండాలో జాప్యం జరిగింది. అక్కడి ధాన్యం కూడా మిల్లుకు తరలించే ఏర్పాట్లు చేస్తానని సీఈవో గంగారాం వివరించారు.

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్‌ పరిశీలన



నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను, పోలీసు బందోబస్తు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్‌, విజయేందర్‌ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ గడ్డం రాజేశ్‌ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 5 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్‌ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని అన్నారు.

యూడీఐడీ పోర్టల్‌లో సదరం సేవలు



డొంకేశ్వర్‌/ నిజామాబాద్‌ అర్బన్‌: దివ్యాంగులు సదరం కోసం యూడీఐడీ పోర్టల్‌లోనే స్లాట్‌ బుక్‌ చేసుకోవాలని డీఆర్డీవో సాయాగౌడ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందించే సర్వీసులపై కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌పై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. యూడీఐడీలో 21 రకాల కేటగిరీలు ఉన్నాయని, ఇక మీదట సదరం కోసం యూడీఐడీలోనే స్లాట్‌ నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు దివ్యాంగులు తమ ఆధార్‌ కార్డును మీసేవ కేంద్రాలకు తప్పనిసరిగా తీసుకెళ్లాలని కోరారు. సొంతగా మొబైల్‌ ఫోన్‌లో కూడా చేసుకోవచ్చన్నారు. ఇదివరకు సదరం సర్టిఫికెట్‌ కలిగి కాలపరిమితి ముగిసిన వారు యూడీఐడీలోనే రెన్యూవల్‌ చేసుకోవాలన్నారు. మీ–సేవ నిర్వాహకులకు ఈ నెల 5న దీనిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డీపీఎం రాచయ్య, ఏపీఎం ఉమా కిరణ్‌, సీడీపీవో సౌందర్య, ట్రైనర్‌ ప్రవంతి, దివ్యాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ పట్టివేత



మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్‌ శివారులో ఉన్న మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను మద్నూర్‌ పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘దోస్త్‌’ నోటిఫికేషన్‌ విడుదల

- మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాలు
- తెయూ పరిధిలో 33,830 సీట్లు



దోస్త్‌ వెబ్‌సైట్‌

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం ‘దోస్త్‌’ (డిగ్రీ ఆన్‌లైన్‌ సర్వీసెస్‌, తెలంగాణ) 2025–26 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ఈ సారి దోస్త్‌ ప్రక్రియను రద్దు చేసి ఇంటర్‌ మార్కుల ఆధారంగా డిగ్రీలో ప్రవేశాలు కల్పించాలని మొదట ఉన్నత విద్యామండలి అధికారులు భావించారు.

అయితే చివరకు ఆలస్యంగా శుక్రవారం దోస్త్‌ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్‌, దోస్త్‌ కన్వీనర్‌ ప్రొఫెసర్‌ వి బాలకిష్టారెడ్డి విడుదల చేశారు. గతేడాది మాదిరిగానే ఈ సారి విద్యార్థికి ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకునేందుకు వీలు కల్పించే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గతేడాది సున్నా అడ్మిషన్లు జరిగిన 82 కళాశాలలకు ఈ సారి అనుబంధ గుర్తింపు ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. కొత్త కోర్సులు ప్రారంభించాలనుకునే కాలేజీల సీట్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

డిగ్రీలో విద్యాప్రమాణాల పెంపు, సిలబస్‌ మార్పుపై నాలుగు నెలలుగా మండలి తీవ్రంగా కృషి చేస్తోంది. వర్సిటీల వీసీలు, విద్యారంగ నిపుణులతో సిలబస్‌ మార్పుపై మండలి చైర్మన్‌ చర్చలు జరిపారు. ఈ ఏడాది నుంచే కొత్త సిలబస్‌ అమలులోకి తెస్తామని తెలిపారు. అయితే దీనికి విద్యాశాఖ ఇంతవరకూ ఆమోదం తెలుపకపోవడంతో సిలబస్‌ మార్పుపై సందేహాలు నెలకొన్నాయి.

రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, జేఎన్‌టీయూ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మరియు శిక్షణ మండలి(టీఎస్‌బీటీఈటీ) డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్‌ సింగిల్‌ విండో ద్వారా సేవలను అందిస్తోంది. విద్యార్థులు ఎవరి సహాయం లేకుండా స్వయంగా తమ డిగ్రీ అడ్మిషన్‌ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్‌లో పేర్కొంది. దోస్త్‌ వెబ్‌సైట్‌ https:// dost. cgg. gov. in ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

- **మొదటి విడత:** మే 3 నుంచి 21వరకు మొదటి విడతగా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. మే 10నుంచి 22వరకు వెబ్‌ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది.
- **రెండవ విడత:** మే 30 నుంచి జూన్‌ 8వరకు దరఖాస్తుల స్వీకరణ. మే 30 నుంచి జూన్‌ 9వరకు వె బ్‌ ఆప్షన్లు. జూన్‌ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- **మూడవ విడత:** జూన్‌ 13 నుంచి 19వరకు దరఖాస్తుల స్వీకరణ. జూన్‌ 13 నుంచి 19వరకు వెబ్‌ ఆప్షన్లు. జూన్‌ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్‌ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం.

తెయూ పరిధిలో 69 కళాశాలలు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ (ప్రభుత్వ 15, ప్రభుత్వ అటానమస్‌ 5, ప్రైవేటు 49) కళాశాలలు మొత్తం 69 ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొత్తం 33,830 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గతేడాది కేవలం 12,764 సీట్లు(37.73 శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ సారి కూడా 40 శాతం లోపే సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్‌ రవికుమార్‌


వివరాలు తెలియజేస్తున్న రవికుమార్‌

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) నూతన డైరెక్టర్‌గా ఎం రవికుమార్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ డైరెక్టర్‌గా పని చేసిన సుంకం శ్రీనివాస్‌ ఏప్రిల్‌ 30న పదవీ విమరణ పొందారు. ఆయన స్థానంలో ఎస్‌బీఐ ఉన్నతాధికారులు రవికుమార్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవికుమార్‌ మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్‌(30రోజులు), సీసీటీవీ ఇన్‌స్టాలేషన్‌(13 రోజులు) ఫొటో అండ్‌ వీడియోగ్రఫీ (30 రోజులు) కోర్సులలో పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 20వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగిన యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని కోరారు. ఆధార్‌కార్డు, రేషన్‌ కార్డు, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డిచ్‌పల్లిలో ఉన్న ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సందర్శించాలని, 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


సమ్మేళనంలో ముదక్‌పల్లి పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

మోపాల్‌: మోపాల్‌ మండలం ముదక్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒకే చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌, పోతన్న, అరుణ్‌కుమార్‌ శర్మ, సత్యనారాయణ, శోభ, పూర్వ విద్యార్థులు జగదీశ్‌రెడ్డి, వినోద్‌, మల్లయ్య, నరేశ్‌, డాక్టర్‌ భాస్కర్‌, రాంచందర్‌, అంజమ్మ, స్వప్న, హంసలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో..

రుద్రూర్‌: వర్ని మండలం శ్రీనగర్‌ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల హైస్కూల్‌ 1999–2000కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్న నాటి మిత్రులు అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.


వర్ని మండలం శ్రీనగర్‌ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

ఇంటర్‌ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


మాట్లాడుతున్న స్పెషల్‌ ఆఫీసర్‌ ఒడ్డెన్న

నిజామాబాద్‌అర్బన్‌: ఇటీవల విడుదలైన ఇంటర్‌ ఫలితాల్లో ఫెయిల్‌ అయిన విద్యార్థులకు ప్రణాళికను రూపొందించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఇంటర్‌ బోర్డు ప్రత్యేక అధికారి ఒడ్డెన్న అన్నారు. ఇంటర్‌ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒడ్డెన్నను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌ జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒడ్డెన్న మాట్లాడుతూ.. ఇంటర్‌ ఫెయిల్‌ అయిన ప్రతి విద్యార్థి పాస్‌ కావడానికి అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని బోధించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యక్ష లేదా ఆన్‌లైన్‌ తరగతులు నిర్వహించాలన్నారు. కమిషనర్‌ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణపై సమీక్ష నిర్వహించి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి రవికుమార్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల అధ్యాపకులు కళాశాలకు హాజరై ఫెయిల్‌ అయిన విద్యార్థుల జాబితా సేకరించి వారందరూ తరగతులకు హాజరయ్యేలా ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పదో తరగతి పాసైన విద్యార్థుల జాబితాను సేకరించి ప్రత్యక్షంగా విద్యార్థులను కలుస్తూ వారిని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చేర్పించేందుకు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. జిల్లా అకడమిక్‌ సెల్‌ ఆర్గనైజర్‌ నరసయ్య, ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌ నుంచి హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు

రుద్రూర్‌: ఎండకాలం ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్‌ బస్టాండ్‌ నుంచి హైదరాబాద్‌కు రుద్రూర్‌, వర్ని, బాన్సువాడ, మెదక్‌ మీదుగా కొత్తగా హైటెక్‌ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ విశ్వనాథ్‌ తెలిపారు. బోధన్‌ బస్టాండ్‌ నుంచి రాత్రి పది గంటలకు బస్సు బయలు దేరుతుందని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రయాణికులు రాత్రి వేళ ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని డిపో సిబ్బంది సీనియర్‌ కంట్రోలర్‌ శంకర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైందన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైటెక్‌ సర్వీస్‌ను ప్రారంభించామని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్టీసీ అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోధన్‌లో కార్డన్‌ సెర్చ్‌


బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌

బోధన్‌టౌన్‌: పట్టణంలోని బస్వతారక్‌నగర్‌ కాలనీలో శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంట్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. కార్డన్‌ సెర్చ్‌లో భాగంగా కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేని 110 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు, ఒక కారుతో పాటు ఒకే ఇంట్లో 35 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కొత్తగా వచ్చిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని, కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐలు వెంకట నారాయణ, విజయ్‌ బాబు, కృష్ణ, ట్రాఫిక్‌ సీఐ చందర్‌ రాథోడ్‌, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

బోరు మోటార్ల కేబుల్‌ వైర్లు చోరీ


ఆలూర్‌లో కేబుల్‌వైర్లు కత్తిరించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్‌: ఆలూర్‌ మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాల్లో రైతుల వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన కేబుల్‌ వైర్లు, ఫీజులు, స్టార్టర్లను గుర్తు తెలియని దొంగలు గురువారం రాత్రి దొంగిలించినట్లు రైతులు తెలిపారు. కల్లెం మోహన్‌, బార్ల మనోజ్‌, కేశపల్లి గంగారెడ్డి, గాదపెల్లి గంగారెడ్డి, మోటార్‌ చిన్నమల్లయ్య, బాదగుణ ముత్యం, మంథని నితిన్‌, బార్ల మనీష్‌, పిప్పర మోహన్‌, అకిడి సత్యం, గాదపెల్లి సాయిరెడ్డి, హరీశ్‌ మిద్దెల, సుమన్‌లకు చెందిన వ్యవసాయ బోరుబావుల నుంచి కేబుల్‌ వైర్లను, స్టార్టర్లను, ఫీజులను దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. తరచూ దుండగులు బోరుబావుల వద్ద నుంచి స్టార్టర్‌ డబ్బాలోని వస్తువులతో పాటు, కేబుల్‌ వైర్లను ఎత్తుకెళ్లడంతో తమకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు దృష్టిసారించి దుండగులను పట్టుకొని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు..

బోధన్‌రూరల్‌: బోధన్‌ పట్టణం ఆచన్‌పల్లి ప్రాంతంలోని రైతుల పొలాల్లో శుక్రవారం మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు బోధన్‌ ట్రాన్స్‌కో టౌన్‌–1 ఏఈ కృష్ణ తెలిపారు. చోరీపై రైతుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పొలాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

హోటల్‌ యజమానికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లికి చెందిన అబ్దుల్‌ ఆసిఫ్‌కు స్పెషల్‌ సెకండ్‌ క్లాస్‌ జడ్జి నూర్జహాన్‌ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. నగరంలోని మాలపల్లిలో రాత్రి వ్యాపార సమయం దాటిన తర్వాత దోశ సెంటర్‌ నడిపించిన అబ్దుల్‌ ఆసిఫ్‌ను జడ్జి ఎదుట ముందు హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో ఒకరికి రెండు రోజులు..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పీఎస్‌ పరిధిలో డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ శుక్రవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన అక్షయ్‌కు డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడడంతో పీఎస్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

టైరు పేలి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న కారు



కామారెడ్డి క్రైం: దేవునిపల్లి శివారులో ఉన్న దేవి విహార్‌ వద్ద ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ఓ కారు ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొన్నది. కారు రోడ్డు కిందకు చెట్ల పొదల్లోకి దూసుకుపోగా విద్యుత్‌ స్తంభం విరిగిపోయింది. తాడ్వాయిలో ట్రాన్స్‌కో సబ్‌ ఇంజినీర్‌గా పని చేస్తున్న శివతేజ కారు నడిపిస్తున్నారు. ప్రమాదంలో అతడికి గాయాలు కాగా స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం సంభవించినప్పుడు సమీపం నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

గుండారం మాజీ ఎంపీటీసీకి రిమాండ్‌

రాజంపేట: మండలంలోని గుండారం మాజీ ఎంపీటీసీ హాజీ నాయక్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు. గత నెల నడిమి తండాకు చెందినన హాజీనాయక్‌ గ్రామంలోని గొడవలను సృష్టించడం, తండాలో జరిగే గొడవలపై కేసులు పెట్టిన వారిపై దాడి చేసినందుకుగాను బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మహిళ మృతదేహం స్వాధీనం

మోపాల్‌: మండలంలోని కాల్పోల్‌ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ (50) మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తునికాకు సేకరణ కోసం అటవీ ప్రాంతానికి వచ్చిన మహిళ వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రుద్రూర్‌ కానిస్టేబుల్‌ సస్పెన్షన్‌

రుద్రూర్‌: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్ధిరాం చిన్నయ్యను సస్పెండ్‌ చేస్తూ శుక్రవారం జిల్లా పోలీస్‌ కమిషనర్‌ సాయి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌ జిల్లా నర్సాపూర్‌ మండలం తెంబుర్తి గ్రామానికి చెందిన రావుల నాగభూషణం అనే వ్యక్తికి ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని కానిస్టేబుల్‌ చిన్నయ్య రూ. రెండు లక్షలు తీసుకుని ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్‌ చిన్నయ్యపై కేసు నమోదైంది. నిర్మల్‌, ఖానాపూర్‌ ప్రాంతాల్లో పలువురి వద్ద ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో క్షమ శిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్‌ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్షా, ఏడుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి నగరంలోని ట్రాఫిక్‌ పీఎస్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించి సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరుపర్చగా ఒకరికి జైలు, ఏడుగురికి రూ.12 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నిందితుడికి ఆరునెలలు..

ఖలీల్‌వాడి: బైక్‌ ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జూనియర్‌ సివిల్‌ జడ్జి వడ్డి హరికుమార్‌ ఆరు నెలల జైలు శిక్షను విధించారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ భూసారపు రాజేశ్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్‌ మండలం మాణిక్‌బండార్‌ తండాకు చెందిన మాలోత్‌ ప్రకాశ్‌ను కల్లెడి గ్రామానికి చెందిన దూదేకుల అర్బాస్‌ నిర్లక్ష్యపు బైక్‌ డ్రైవింగ్‌తో మాక్లూర్‌ పరిధిలో ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రకాశ్‌కు తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు అర్బాస్‌పై పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నిందితుడు అర్బాస్‌ నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి అతనికి ఆరు నెలల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

ముందస్తు బడిబాట!

- సర్కార్‌ బడుల్లో పిల్లల ప్రవేశాలకు టీచర్ల ప్రయత్నాలు
- ప్రభుత్వ సౌకర్యాలపై విస్తృత ప్రచారం


ధర్పల్లి: దమ్మన్నపేటలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు వెంకటరాజారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి కొందరు ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం చేపడుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ, కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ బడులపై ప్రచారం చేస్తున్నారు. బడుల్లో అందించే సౌకర్యాలను వివరిస్తూ, విద్యార్థుల ప్రవేశాల కోసం కృషి చేస్తున్నారు.

ఎస్సెస్సీ ఫలితాలు.. ప్రత్యేక సమావేశాలు..

ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు గణనీయమైన ఉత్తీర్ణత సాధించాయి. దీంతో కొందరు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ ఉత్తమ ఫలితాలను ప్రచారం చేస్తూ ముందస్తు బడిబాటను చేపడుతున్నారు. మరికొందరు ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి ప్రచారం నిర్వహిస్తూ వారి ప్రవేశాలను పెంచుకునే పనిలో ఉన్నారు. బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్‌ మండల కేంద్రంలోని ఉపాధి కూలీలతో ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించారు. జక్రాన్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్‌ తొర్లికొండలో ఇంటింటా ప్రచారం చేపడుతున్నారు. ధర్పల్లి మండలంలో పలువురు టీచర్లు ఉపాధి హామీ కూలీలు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ బడులవైపు ఆకర్షించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వ బడుల్లో దాదాపుగా 18వేల అడ్మిషన్లు తగ్గాయి. ఈ తరుణంలో కొందరు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ముందస్తు బడిబాటపై పలువురు ప్రశంసిస్తున్నారు.

విద్యాశాఖ నూతన కార్యాచరణ..

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యను పెంచడానికి వేసవి సెలవుల్లో విద్యాశాఖ నూతన కార్యాచరణకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విద్యాసంవత్సరం పాఠశాలల వారీగా ఏ ఉపాధ్యాయుడు ఎక్కువ మంది పిల్లలను చేర్పిస్తాడో వారికి పాయింట్లు ఇచ్చి సర్వీస్‌ బుక్కులో నమోదు చేసేలా కార్యాచరణ రూపొందించనున్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించేటప్పుడు ఈ పాయింట్లకు ప్రాధాన్యత కల్పించనున్నారు. అలాగే విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలను తెరిపించే విధంగా మార్గదర్శకాలు రూపొందించనున్నారు. ఇందుకోసం వేసవిలో ఉపాధ్యాయులకు బడిబాటపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రభుత్వ బడి ప్రాముఖ్యత వివరిస్తున్నాం..

గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు, మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన ప్రభుత్వ బడి ప్రాముఖ్యతను గురించి వివరిస్తున్నాం. ప్రభుత్వం అందించే సౌకర్యాలు పలు అంశాలను తెలియజేస్తున్నాం. మా పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలే లక్ష్యంగా ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నాం.

– అంకం నరేశ్‌, ఐఎఫ్‌ఎల్‌ హెచ్‌ఎం, రేకులపల్లి

బాకీ డబ్బులు అడిగినందుకే హత్య

- నర్సన్నపల్లి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్‌ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని సరంపల్లి శివారులో వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసును 48 గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. గతంలో అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకే నిందితుడు ఆమెను హత్య చేసినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్‌ చంద్ర వివరాలు వెల్లడించారు. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన కవిత(44) బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త గంగారెడ్డి, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించింది. మృతురాలు ఒంటిపై ఆభరణాలు లేకపోవడంతో దుండగులు ఆమెను హత్య చేసి ఉంటారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆధారాలతో నిందితుడిని పాత నేరస్తుడు జంగంపల్లి మహేశ్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ఏడాది క్రితం నిందితుడు భిక్కనూర్‌ పీఎస్‌ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. ఆ కేసులో జైలులో ఉన్న అతడికి బెయిల్‌ మంజూరు చేయించడానికి గాను అతడి కుటుంబ సభ్యులు ఈ కేసులో మృతురాలైన చిదుర కవిత వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. మహేశ్‌ నెల రోజుల క్రితం బెయిల్‌ పై బయటకు వచ్చాడు. తన వద్ద తీసుకున్న రూ.లక్ష తిరిగి ఇవ్వాలని కవిత పలుమార్లు మహేశ్‌ను అడగడంతో ఆమెను చంపేస్తే డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని భావించిన అతను పథకం ప్రకారం బుధవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రం దగ్గరకు వస్తే డబ్బులు ఇచ్చేస్తానని చెప్పి నమ్మించాడు. ఒంటరిగా ఉన్న కవితపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆపై చీరతో మెడకు ఉరి బిగించి హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్లాడని ఎస్పీ వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. 48 గంటల్లోనే కేసును ఛేదించడంలో విశేషంగా కృషి చేసిన కామారెడ్డి రూరల్‌ సీఐ రామన్‌, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.